
శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

ప్రజ్ఞ ప్రార్థన



ప్రథమ పుణ్యతిథి మహోత్సవం



అందరి హృదయాలలో ప్రేమజ్యోతి వెలిగించిన దివ్యమూర్తి!
అందుకోవయ్యా మా ప్రణతులందుకోవయ్యా! గురువర్యా!

సాయి సాంప్రదాయాన్ని సుగమం చేసి అందించి,
పంచుకోవడమన్ననేమో మాకెల్లరకు నేర్పి,
సాయిభక్తి సాధనా రహస్య రచనతో
లోకాలకెల్ల కొత్త వెలుగులు కురిపించిన భవ్యమూర్తి
అందుకోవయ్యా! మా ప్రణతులు అందుకోవయ్యా! గురురాయా!

సాయిపథానుసరణతో విశ్వమూర్తివై
బాబానే మార్గంగా చూపి బాబానే గమ్యంగా తెలిపి
ప్రేమ అనే ధ్యేయంతో మము నడుపుతున్న ప్రేమమూర్తి!
అందుకోవయ్యా మా ప్రణతులందుకోవయ్యా! గురుదేవా!

లోకములో నీకై, నీకోరకై గాక, క్షణక్షణము మాకై, మా కొరకై గడిపి
గగన పథమందు గమనిస్తూ సూర్యతేజునిగా,
శరత్ చంద్రునిగా మారిన రూపకర్త!
అందుకోవయ్యా! మా ప్రణతులు అందుకోవయ్యా! సద్గురురాయా!
దివ్యసూక్తులు మాకందించి దివ్య ప్రేమనందులోన వెలయించి
దివ్యస్ఫోరక ప్రతిభామూర్తివై భోసిల్లే సద్గురుమూర్తి
అందుకోవయ్యా! మా ప్రణతులు అందుకోవయ్యా! సత్ప్రేమమూర్తి!

సంపుటి : 15
సంచిక : 1

ప్రథమ పుణ్యతిథి
13-11-2011

# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

ప్రజ్ఞయే ప్రార్థన 4
- గురుకృప

ఆనందస్వరూపం 5
- శరశ్చంద్రికలు

గురువుగారి బాబా 9
- శరశ్చంద్రికలు

జ్ఞానరత్నాలు 16
- పూజ్యశ్రీబాబూజీ సత్సంగం

దక్షిణ 18
- - గురుకృప

(ని)దర్శనం 21
-సుజాత

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**
GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.




# ప్రజ్ఞయే ప్రార్థన

"ఋణానుబంధాన్ని గుర్తుంచుకో, ఎవరూ నీ వద్దకు ఋణాను బంధం లేనిదే రారు' అని అన్నారు శ్రీసాయి. "నా బిడ్డ అడిగితే ఎలా తన సమస్యలకు స్పందిస్తానో అలానే మీరడిగినా మీ సమస్యలకు, సందేహాలకు స్పందిస్తాను. అలా స్పందించడం మిమ్మల్ని వుద్ధరించడానికో, నా కర్తవ్యమనో నేను భావించడం లేదు. మీ సమస్యలకు తగిన పరిష్కారం చూపడం, కష్టాల్ని చేతనయినంతవరకు తీర్చడం ఇదంతా మీ పట్ల బాబాపట్ల నాకున్న ప్రేమకు వ్యక్తీకరణగానే భావిస్తాను. ప్రేమను వ్యక్తం చేసే కొలది పెరుగుతుంది. మీరందరూ నాకు బాబా ప్రతిరూపాలే. మీపట్ల నా ప్రేమను వ్యక్తపరచుకుంటూ బాబాతో బంధాన్ని, అనుబంధాన్ని ఇంకా పెంచుకుంటున్నాను. మీ కష్టాలు, సమస్యలు తీరితే మీరు చాలా ఆనందిస్తారు. అలా అందరూ ఆనందంగా ఉండటమనేది నాకు సంతోషాన్నిస్తుంది. ఆనందస్వరూపులైన బాబాతో మమేకం చేస్తుంది" అంటూ తమ జీవిత పర్యంతం ఆచరించి చూపారు సద్గురు చంద్రులు, గురుమహరాజ్ శ్రీబాబూజీ.

దైవం – సద్గురువుగా అవతరించి, ఒక సాధారణ మానవునిగా జీవించడం ఎందుకు జరిగిందన్నది మనం కొంతైనా అవలోకించి చూద్దాం. భక్తిసాధనా సామగ్రి అయిన జప, నామ, ధ్యానాది క్రతువులను అవతార వరిష్టులు, ఋషి పుంగవులు, యోగులు, సిద్ధులు... ఇలా ఎందరో సెలవిచ్చారు. అట్టి ప్రక్రియలలో సులువులను నేర్పారు. కానీ, సర్వసమున్నత సద్గురుతత్వం మాత్రం వీటికి ఆద్యమైన మానవ పరివర్తనను, పరిణామ క్రమప్రక్రియను ఒక సాధారణ జీవునిగా అందరితో చేరి ఉద్ధరించ నడుం బిగించింది. భక్తిసాధనను చక్కదిద్దుకోవాలంటే ముందు మన పరివర్తన మారాలి. ప్రతిజీవి మన వద్దకు ఋణానుబంధంతోనే చేరుతోందన్న సద్గురు 'ప్రజ్ఞ' (బుద్ధి, అవగాహన) కలిగి వుండాలి. నిజానికి గురువు చూసేది మన జప, ధ్యానాదులను కాదు. మనం ఒక మనిషిగా ఎంత ఎదిగామన్నదే! అదే మన ప్రగతికి కొలబద్ద.

ఒకానొక సమయాన ఒక సద్గురుభక్తుడు తమ పరమ గురువును శంఖు, చక్రాలతో తన ధ్యానమందు దర్శించుకున్నారట. ఆనందపరవశులై, ఆ అనుగ్రహ భాగ్యమునకు పొంగిపోయి సాటి భక్తులతో పంచుకునేందుకు సిద్ధమయ్యారు. ఇది ఇలా వుంటే ఒకనాడు తమ నిత్యకృత్యమున ఒక వ్యక్తితో కడు పరుషముగా ప్రవర్తించి తమ వైఖరితో తప్పిదము చేసినాడు అదే భక్తుడు. కనీసము ఆ విషయమును తమ గురువు చెంతన వెల్లడి కూడా చేయలేదట. తదుపరి మూడు దినములలో తన ప్రసంగవశమున తన గురువు ఇట్లా చెప్పిరి. "కొందరు సాధకులు తమ ధ్యానమునందు ఏవో దివ్యానుభూతులు కలుగుచున్నవని మురిసిపోవుచుందురు. తమ ప్రవర్తనతో మాత్రము ఇతరులకు నొప్పి కలిగించుచుందురు. ప్రవర్తనలో లోపములను సర్దుకొని, ఎల్లరిలో గురువు అను వెలుగును దర్శించినపుడే సాధనలో ముందడుగు వేయుచున్నట్లు లెక్క. ఇది లేకుండా దివ్యానుభవములనునవి వట్టి బూటకములు. వికాసము కలిగించుటలో నిరుపయోగములు" అంటూ ఆ భక్తుని సున్నితముగా, పేరు ప్రస్తావించకయే మందలించిరట. మన జీవన వర్తన, సాటి జీవులతో మన ప్రవర్తన ఎంత ప్రాధాన్యతను కలిగి వున్నదో చెప్పకనే చెప్పారు సద్గురుమూర్తులు.

"వివిధ ప్రాణుల రూపంలో వస్తున్న నన్ను ఎవరైతే గుర్తించి, ఆ గ్రహింపుకనుగుణంగా మసలుకుంటారో వారు నాకెంతో ప్రీతిపాత్రులు, ఆప్తులు" అన్నారు శ్రీసాయి. ఈ వాక్యాలకు భాష్యాలు, ఆచరణాత్మక ఆదర్శాలు




శ్రీబాబూజీ అనునిత్యం తు.చ.తప్పకుండా అవధరించి చూపారు. సర్వజీవులలో ఉన్నది సద్గురు ప్రజ్ఞయే కాని మరొకటి కాదు. కనుకనే "ఇక్కడ అంతా రికార్డెడ్‌గా వుంది. ఎప్పుడు ఎవరు, ఎక్కడకు వచ్చారు, ఎక్కడ ఏ వరుసలో కూర్చొన్నారన్న చిన్న అంశం కూడా ఇక్కడ రికార్డు వుంది" అన్నంత సర్వవ్యాపక సమర్థత్వం ఆ సద్గురుచంద్రునికే సాధ్యమయ్యింది. సద్గురుస్వరూపులారా! భక్తిని మహాత్ముల మాటల్లో చూస్తే "జీవులుగా దిగివచ్చిన భగవంతుని యందు మనము చూపే అవ్యాజ్యప్రేమయే భక్తి". 'సాయి' అన్న ఒక మహత్తర అవ్యాజప్రేమ బంధము మాత్రమే మనందరిని ఒక 'పథానికి' చేర్చింది. ఇక్కడి 'సరంగు' నిక్కముగా సత్ప్రేమమూర్తి, కరుణకు తాను కల్పతరువు, దయాస్వరూపుడు. మనందరి తల్లి, తండ్రి, గురువు తానే. 'భవసాగర' చింతను తాను 'సాయి 'అనుభవ'సాగరము'గా మార్చి మనలను సాయిదరి చేర్చగలడు. సాయి'దరి' తెలిసాక తాను ఇక నిద్రించింది లేదు. ఎందరినో, ఎందరెందరినో అక్కడకు చేర్చాలని, సేద తీర్చాలని తపించాడు ఆ 'సరంగు'. తపించిన ఆ 'సరంగు'కు సరియైన సమర్పణ మనమందరం శ్రీసాయి ఏకాత్మస్వరూపులమని గుర్తించి – ఆ గుర్తింపుకనుగుణంగా అందరిలో వున్నది సద్గురువేనన్న ప్రజ్ఞను కలిగి, ప్రేమను పంచి, ఎదుటివారిని వారి వారి వేష, భాషలకు పరిమితి చేయక, వారిలోని 'గురువును' దర్శించి ప్రవర్తించడం. అట్లా మన నిత్య జీవనాన్ని మలుచుకోగలిగిన నాడు మనల్ని మనం గురువుకు సమర్పించుకోగలం. సద్గురువు తన బిడ్డల నుండి ఆశించేది, మనం త్రికరణశుద్ధిగా అర్పించాల్సింది కేవలం సర్వ జీవులలో సద్గురు ప్రజ్ఞయేనన్న యెరుకే. నిజానికి ఇది చేయగలిగిననాడు మనం 'నిత్యప్రార్థన' చేసినట్లే.

సద్గురు స్వరూపులారా! పదండి కొండంత దివిటీ వెలిగిద్దాం, మనలోని 'నేను'ను శోధించి, 'అహాన్ని' అగ్గితో కాల్చి, పేరుకుపోయిన మలిన వాసనల దొంతరలకు పాతర వేద్దాం. తొలగిపోయిన చీకట్లను, సద్గురు అనుగ్రహ వెలుగులతోనింపి హృదయాన మన సద్గురుమూర్తిని ప్రతిష్టించుకుందాం, సద్గురుప్రజ్ఞను కలిగి వుందాం, బ్రతుకును నిత్య ప్రార్థనగా చేసుకుందాం, సాటి వారందరి పట్ల ప్రేమతో చరిద్దాం.

## శరచ్చంద్రికలు

### ఆనందస్వరూపం - సెప్టెంబర్ 2011

**భక్తుడు :** గురువుగారూ! మా అంతరంగంలో ముక్తి కావాలని, జ్ఞానం కావాలని, బాబాను తెలుసుకోవాలనేటటువంటి ఈ కోరికకు, తపనకు అసలు కారణం ఏమిటి? ఇటువంటి తపన ఎక్కడి నుండి వస్తుంది?

**గురువుగారు :** దీని గురించి చాలాసార్లు వివరించాననుకుంటాను. ఇలా ఎందుకు జరుగుతుందంటే – నీలో ఏదో కొరత వుంటుంది, ఏదో కావాలనిపిస్తూ వుంటుంది. అదేంటో నీకు తెలియదు. నువ్వు బాబాను దర్శించినపుడు నీవేమి కావాలనుకుంటున్నావో దానికి ఆయన ఒక స్పష్టమైన, సంగ్రహమైన, మూర్తీభవించిన రూపంలా అనిపిస్తారు. నువ్వు దానిని ఇదీ అని వర్ణించలేవు. విడమరచి చెప్పనూ లేవు. అయినప్పటికీ నిగూఢ రీతిలో, స్వతఃసిద్ధంగా, తనంతటతానుగా యేదో నీకు తెలియచేస్తుంది – "అది




ఆయనే" అని. నీలో అస్పష్టంగా వున్న ఆ పరిపూర్ణత్వ భావనకు (ఆనందానికి) స్పష్టమైన రూపం ఆయన. నీలో అస్పష్టంగా వున్న పరిపూర్ణత్వ భావనను బాబా ప్రజ్వరిల్లచేస్తారు. నీదైనటువంటి ఆ పరిపూర్ణత్వ భావనకు బాబా ప్రతీక కాబట్టి నువ్వు ఆయన్ని ప్రేమిస్తావు. నీ ఆనందాన్ని నువ్వెలా ప్రేమిస్తావో అలానే బాబాను ప్రేమిస్తావు. ఇంకోరకంగా చెప్పాలంటే బాబా పట్ల నీకుండేటటువంటి ప్రేమ, నీలో అస్పష్టంగా వున్న నీ పరిపూర్ణత్వ భావన పట్ల నీకు గల ప్రేమే. అదిగాక బాబాను ప్రేమించడానికి నీకు వేరే కారణమంటూ ఏమీ లేదు. అయినా, నువ్వు బాబాను ఎందుకు ప్రేమిస్తావు? నీ హృదయంలోని ఆనందానికి ఆయన ప్రతిరూపంగా నిలుస్తారు కాబట్టి నువ్వు బాబాని ప్రేమిస్తావు.

**భక్తుడు :** గురువుగారూ! మీ వద్దకు ఎంతోమంది వచ్చి సాష్టాంగ నమస్కారాలు చేసి మీ ఆశీస్సులు అర్థిస్తారు. వాళ్లు మీ పాదాలను తాకినపుడు మీరెలా భావిస్తారు?

**గురువుగారు :** నాకేమీ అనిపించదు! అసలు వాళ్లు నాకు నమస్కరిస్తున్నట్లుగా నేను భావించను. ప్రతి ఒక్కరికి వారికే స్వంతమైన ఓ అస్పష్టమైన సంపూర్ణత్వ భావన వుంటుంది. దానిని వాళ్లు అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవాలని సర్వదా ప్రయత్నిస్తూ వుంటారు. ఆ సంపూర్ణత్వ భావనకే అందరూ సదా శరణాగతి చెంది వుంటారు. అంతటా నిండివున్న అది (ఆ భావన) అస్పష్టంగా వుండటం వలన వారు దానిని స్పష్టంగా అనుభూతి చెందలేరు. అందువల్ల దానిని గురించి తెలుసుకోవాలని, వాస్తవంగా చేసుకోవాలని ప్రతి ఒక్కరూ యత్నిస్తుంటారు. కొంతమందికి వారిలోని అస్పష్టమైన సంపూర్ణత్వ భావనకు ప్రతీకగా నిలిచే బాబా వంటి సద్గురువును చూసినపుడు వారిలో ఆ సంపూర్ణత్వ భావన జాగృతమవుతుంది. అటువంటి వారు, వారి ఆనందానికి సద్గురువు మార్గం కాబట్టి దానిని అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకునే యత్నంలో భాగంగా వాళ్లు సద్గురువును తెలుసుకొని ఆయనకు శరణాగతి చెందుతారు. బాహ్యంగా చూస్తే వాళ్లు సద్గురువుకు శరణాగతి చెందినట్లు కనిపించినా, వాస్తవానికి వాళ్లు తమ ఆనందానికే శరణాగతి చెంది వున్నారు. ఈ మొత్తం క్రమాన్ని దాని తత్త్వాన్ని అర్థం చేసుకుంటే నాకు నమస్కరించే వారందరూ నిజానికి నా పాదాలు తాకటం లేదని మీరు తెలుసుకుంటారు. వాస్తవానికి తమ పరిపూర్ణత్వ స్థితినే వాళ్లు స్పృశించాలని ప్రయత్నిస్తున్నారు.

ప్రజలు నాకు నమస్కరించినపుడు నేనెలా భావిస్తాను అని మీరడిగారు. ఒకవేళ నాకు ఏదైనా అనిపిస్తే అది : "ఆ నమస్కారాలన్ని నాకు కాదు, బాబాకు" అని అనుకుంటాను. ఎందుకంటే నా పరిపూర్ణత్వ భావనకు, ఆనందానికి సాకార రూపం సాయిబాబా. చాలామందికి తమ పరిపూర్ణత్వ భావనను జాగృతం చేయడానికి, సుస్పష్టం చేసుకోవడంలో సహాయపడడానికి ఓ గురువు అవసరం. వారికి గురువు అవసరం కాబట్టి కొంతమంది నన్ను అలా భావించి దానికి అనుగుణంగా ప్రవర్తిస్తారు. కానీ నాకు సంబంధించిననంతవరకు నాకు శిష్యులు కాని, భక్తులు కాని అవసరం లేదు. కాబట్టి వారిని నేను ఆ దృష్టితో చూడను.




**భక్తుడు :** గురువుగారూ! "అస్పష్టము అవ్యక్తము అయిన దానిని వాస్తవం చేసుకోవడం" అనడంలో మీ ఉద్దేశ్యాన్ని వివరిస్తారా?

**గురువుగారు :** తప్పకుండా. ఒక లక్షరూపాయలు ఎవరో నీ బ్యాంక్ ఖాతాలో డిపాజిట్ చేసారనుకుందాం. కానీ నీ దగ్గర చెక్‌బుక్ లేదు కాబట్టి నువ్వు దానిని తీసుకోలేవు. నిన్ను నువ్వు ధనవంతునిగా భావిస్తావా? లేక పేదవానిగానా? నువ్వు ధనవంతుడివే కానీ దానిని వాస్తవం చేసుకోవడానికి, ఆ డబ్బును స్వంతం చేసుకోవడానికి నీకు చెక్‌బుక్ కావాలి. బ్యాంక్‌లో లక్షరూపాయలు ఉన్నాయి అనే నిజం అస్పష్టమైన అనుభూతి. వాటిని బ్యాంక్ నుండి తీసుకొని చేతిలో పట్టుకోవడం వుంది చూసారా, అది దానిని అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవడం!

**గురువుగారు :** నేను దాని గురించి ఇంకోసారి చెప్తున్నాను. నువ్వు ఓ గురువుకో, ఓ సద్గురువుకో లేక ఓ బుద్ధునికో శరణాగతి చెందవు. నువ్వు ఎల్లప్పుడూ నీకుండేటటువంటి ఆ సంపూర్ణ భావనకే (ఆనందానికి) శరణాగతి చెందుతావు. ప్రతి ఒక్కరు శరణాగతి చెందుతారు. ఎప్పుడో శరణాగతి చెందే వుంటారు. చాలామందికి వాళ్ళు దేనికి శరణాగతులో అర్థం కాదు. ఎందుకంటే వాళ్లకు ఫలానిది తమకు సంతృప్తినిస్తుందనే విషయం ఇంకా చాలా అస్పష్టంగా, అవ్యక్తంగా, ఎంతో అయోమయంగా వుంటుంది. నీలోని ఆ భావనకు ఆయన ఒక వాస్తవరూపమైన చిహ్నంగా నిలుస్తారు కాబట్టి నువ్వు బుద్ధుని (సద్గురువు) పాదాలను తాకడం ద్వారా, నీలోని అస్పష్టమైన సంపూర్ణత్వం పట్ల నీకు గల శరణాగత భావాన్ని నిర్దిష్టంగా ప్రకటిస్తావు. అది ఎలా వుంటుందంటే: నేను బాబాను చూసినపుడు, "నాలోని ఆ పరిపూర్ణత్వ భావనకు వాస్తవ వ్యక్తరూపం ఆయన" అని అనిపించినట్లుగా. నీలో అస్పష్టంగా వున్న ఆ సంపూర్ణత్వమనే భావనను ఓ స్పష్టమైన రూపంలో చూసినపుడు, దానిని ఇంకా ఇంకా స్పష్టంగా తెలుసుకోవడం సాధ్యమవుతుంది. అది ఐహికమై మరెంతో వాస్తవికతను సంతరించు కుంటుంది. ఇది మన యొక్క పరిణామక్రమం అని తెలుసుకున్నపుడు మిగతా సందేహాలు మాయమవుతాయి. నువ్వు నీ జీవితం యొక్క పాదాల దగ్గరే శరణాగతి చెందగలవు, అన్నీ వదిలిపెట్టగలవు. అంతేకాని వేరొకరి పాదాల దగ్గర కాదు. అందుకనే నేను మీ జీవితాలను వదిలిపెట్టమని అడగడం లేదు. తీసుకోండి.... మీ జీవితాలను ఆ చివరిదైన పరిపూర్ణత్వాన్ని పొందడానికి ఓ పథంగా చేసుకోండి, అప్పుడు ప్రతిదీ, మీరు తీసుకునే ప్రతి శ్వాస పరిపూర్ణత్వం కోసం మీరు పడే తపనకు ఊపిరిలూదుతుంది.

**గురువుగారు :** ప్రతి ఒక్కరు, జీవమున్న ప్రతి ప్రాణి – ఏదో ఒక దానికోసం, ఒక రకమైన తృప్తికోసం అన్వేషిస్తుంది; ప్రతి ఒక్కరూ కూడా. ఆధ్యాత్మిక అన్వేషకులు (సాధకులు), ప్రాపంచిక కోరికల కొరకు ప్రయత్నించేవారు అంటూ ఏమీ లేదు. ప్రతి ఒక్కరూ (తృప్తి కోసం) అన్వేషిస్తూనే వున్నారు. కొంతమంది డబ్బు కోసం, కొంతమంది కీర్తి కోసం, కొంతమంది కుటుంబం కోసం, కొంతమంది పిల్లల కోసం, కొంతమంది సుఖం కోసం – ఇలా ప్రయత్నిస్తూనే వుంటారు. అన్వేషణకు (తృప్తికి) మార్గాలు అనేకం. అందరూ వీటిని ఎందుకు ఆశిస్తున్నారు? ఆనందం వాటిల్లో వుంటుందని వారు భావిస్తారు కనుక. వీటిని




పొందడం వలన వాళ్లకు నిజంగా ఆనందం వస్తుందో లేదో తెలియదు. ఆ పరిపూర్ణత్వ భావన వారికి బాగా అస్పష్టంగా వుంటుంది కాబట్టి వీటిని పొందితే తమకు ఆనందం వస్తుందని అనుకుంటూ వుంటారు.

నాకు మంచి ఉద్యోగం వస్తే ఆనందం వస్తుంది. స్విస్ బ్యాంక్‌లో ఒక బిలియన్ డాలర్స్‌గాని వుంటే అప్పుడు నేను ఆనందం పొందుతాను. లేకపోతే అందమైన అర్ధాంగి వుంటే నాకు ఆనందం వస్తుందని అతను, నా మాట వినే భర్త దొరికితే నాకు ఆనందం వస్తుందని ఆమె అనుకుంటూ వుంటారు (గురువుగారు నవ్వుతూ) ... ఇలా ఎన్నో... ప్రతి ఒక్కరికీ తాము దేనికోసమైతే యత్నిస్తున్నారో దానికి సంబంధించిన కొన్ని ఆలోచనలు వుంటాయి. కానీ కొంతమందికి వీటన్నింటిని పొందినా కూడా – మంచి ఉద్యోగం, మంచి భార్య, పిల్లలు, బ్యాంక్ అకౌంట్, కొంచెం పేరు ప్రతిష్టలు ఇవన్నీ వున్నా నిజంగానే సంతృప్తిగా వున్నారా? వారికి అన్నీ వున్నాయా? వారి జీవితంలో ప్రతి క్షణం తన్మయమైన పరిపూర్ణ ఆనందాన్ని అనుభవిస్తున్నారా? లేకపోతే "మాకు అన్నీ వున్నాయి, ఇక చెప్పడానికి, ఆలోచించడానికి ఏముంది" అని ఏదో ఉన్నదానితో సరిపెట్టుకుంటున్నారా? కానీ కొంతమందికి ఇవన్నీ సరిపోవు. ఇంకా ఏదో కొరతను అనుభవిస్తూ వుంటారు. అలా వెలితిని అనుభవించే వారికి ఆ వెలితి అంతుబట్టని విషయం (మిస్టరీ). అది వారి అసంపూర్ణ కథ (మిస్సింగ్ స్టోరీ) (గురువుగారు నవ్వుతూ) నిజానికి వారికి ఏది ఆ ఆనందాన్నిస్తుందో తెలియదు. అప్పుడు, ఏదో కారణం వల్ల అది ఎందుకు అనేటటువంటి సిద్ధాంతాలలోనికి నేను వెళ్లదలచుకోలేదు. అస్పష్టమైన వారి ఆనందం మూర్తీభవించినటువంటి ఒక వాస్తవమైన వ్యక్తిని చూసినపుడు, ఏ కారణము లేకుండానే, వారికి ఆనందం పొందగలము అనిపిస్తుంది.

నా విషయంలో అది సాయిబాబా. ఆయన్ని అలా చూస్తూ వుంటే నాకు సంతృప్తిగా అనిపించేది. ఆయన నాకేదో ఇచ్చారని కాదు. ఆయనది ఎంతో సుందరమైన రూపం అని కాదు (గురువుగారు నవ్వుతూ) ఆయన మంచి వక్తనో లేక మంచి రచయితనో కాదు, ఆయన పండితుడా, జ్ఞానా అని మనకు తెలియదు. కనీసం ఆయన మాట్లాడినపుడు మనం వినను కూడా వినలేదు. అయినప్పటికీ ఆయనను చూస్తే ఏదో జరుగుతుంది. ఒక భద్రతాభావం, సంతృప్తి, ఆనందం, ఓ పరిపూర్ణతా భావం కలుగుతుంది – ఏదో అస్పష్టంగా వున్నది సుస్పష్టమయినట్లు. "అది ఇదే, ఇదే అది" అనిపిస్తుంది. ఎలా? మనకు తెలియదు. మనలో ఏదో ఆకర్షణ, ఆ ఆకర్షణలతో సమ్మిళితమైన ఓ భద్రతాభావం. ఆయన దగ్గర నుండి మనమేదో భద్రతను పొందామని కాదు. "ఆందోళన చెందవద్దు, నీ సమస్యలన్నీ నాకు తెలుసు. నేను చూసుకుంటాను. నేను చేస్తాను" అని చెప్పి ఆయన మనకేదో వారెంటీ ఇచ్చారని, గ్యారంటీ ఇచ్చారని కాదు, ఆయనేమీ చెప్పలేదు, మనమేదీ పొందలేదు. అయినప్పటికీ "ఆయన చూసుకుంటారు, నాకేమీ కాదు" అని మనకు భద్రతాభావం కలుగుతుంది. ఈ అనుభూతి ఏమిటి? అది సినిమా చూసినపుడో, అందమైన ప్రకృతిని చూసినపుడో కలిగేటటువంటి సంతోషం కాదు. అది దేని గురించి పట్టింపులేనటువంటి ఆనందం. ఒకరకమైన రక్షణతో కూడిన ఆనందం. నాకేమి




జరిగినా ఆయన చూసు కుంటాడు, ఎందుకని?... ఏమో మనకు తెలియదు. (గురువు గారు నవ్వుతూ) మనకా అర్హత వున్నదనా?... అదీ మనకు తెలియదు. మనకు సహాయం చేయాలని ఆయన ఆత్రంగా వున్నారా?... అది కూడా మనకు తెలియదు. కానీ ఆయన మనకు తప్పకుండా సహాయం చేస్తాడని మాత్రం ఖచ్చితంగా తెలుసు. ఒకవేళ మనకు కష్టాలెదురైతే ఎక్కడికెళ్ళాలో మనకు తెలుసు. ఊరికే ఆయన సాన్నిధ్యం, ఆయన రూపావలోకనం, ఆయన గురించిన ఆలోచనే మనకు నమ్మకం పెంపొందిస్తుంది. ఎందుకు? ఎలా? అని మనకు తెలియదు. ఈ ఆకర్షణకు, సంతృప్తికి, ఆనందానికి, భద్రతాభావానికి అవ్యాజ్యమైన ఆనందానికి కారణం ఏమిటి? ... మనకు ఏ కారణాలు తెలియవు. కాబట్టి ఇదీ అంతుపట్టని విషయం (మిస్టరీ). చివరకు ఇవన్నీ ప్రసాదించిన రూపాన్ని ఒక సద్గురువు అని పిలవాలనిపిస్తే, సరే అలాగే ఆయనను ఒక సద్గురువు అని మీరు పిలుచుకోవచ్చు. లేదంటే మీకు ఏ పేరు నచ్చితే ఆ పేరుతో పిలుచుకోవచ్చు. కానీ జరిగేది మాత్రం ఇదే. గురువు ద్వారా లభ్యమయ్యే పరిపూర్ణమైన ఆనందమే ఈ అంతుబట్టని అంతరార్ధంలో లోపించిన విషయం. మీరు దానికి మరిన్ని సిద్ధాంతాలు జోడించి ఆ అంతరార్థాన్ని ఇంకా నిగూఢపరచదలిస్తే అలాగే కానివ్వండి. లేక ఖచ్చితంగా "ఇక్కడ ఏం జరుగుతోంది" అనే విషయం మీరు తెలుసుకోదలిస్తే, ఇక్కడ జరుగుతున్నది ఇదే. అంతకుమించి ఏమీ లేదు. అలా అని అందులోని విలువ తక్కువేమీ కాదు.

## గురువుగారి బాబా - *అక్టోబర్ 2011*

**భక్తుడు :** గురువుగారూ! మీరు బాబా వద్దకు ఎలా వచ్చారు?

**గురువుగారు :** నేను బాబా దగ్గరకు 'రావడం' అనంటూ ఏమీ లేదు. ఎప్పుడూ ఆయనను చూస్తూ వుండటం నాకు ఇష్టంగా వుండేది. నేను ఎప్పుడు బాబా ఫోటోను చూసినా, నాకెందుకో ఆయన చాలా సజీవంగా వున్నట్లు, నాతో సన్నిహితంగా వున్నట్లు, నాకు బదులిస్తున్నట్లు అనిపించేది. అలాగని, నాకు ప్రత్యక్షమవ్వడమో లేక సందేశాలివ్వడమో కాదు. అలా కాదు! కానీ ఆయనను ఎప్పుడు చూసినా ఏదో బలమైన ఆకర్షణ కలిగేది. ఆయనకు, నాకు మధ్య ఎంతో సాన్నిహిత్యం ఉన్నట్లు అనిపించేది.

**భక్తుడు :** మీకు బాబాతో గల మొదటి అనుభవాన్ని మాకు చెప్తారా?

**గురువుగారు :** మొదటిది, రెండవది, మూడవది... అంటూ ఏమీ లేదు. నేను చిన్న పిల్లవాడిగా వున్నపుడు కూడా బాబాను చూసిన ప్రతిసారీ ఎందుకనో ఆకర్షణకు లోనయ్యేవాడిని. నేను ఆయన వాడిని అనే భావన ఉండేది. దానిని నా మొదటి అనుభవం అంటే అనవచ్చు. నాకు బాబా అంటే ఎవరో తెలియదు. ఆయన పేరు తెలియదు, ఏం తెలియదు. నా చిన్నతనంలో ఆయన ఫోటో ఒకటి మా ఇంట్లో వుండేది. మా నాయనమ్మను ఆయనెవరు అని అడిగేవాడిని. అందరు దేవుళ్లకు, దేవతలకు కిరీటాలు, ఆభరణాలు వుండేవి. కొందరు మనిషి రూపంలో వుంటే, కొంతమందికి జంతువుల తలలు వుండేవి. ఇలా రక రకాలుగా వుండేవారు. కానీ బాబా, వారందరి కంటే భిన్నంగా కనిపించేవారు. ఆయన ఒక సాధారణ




“ఆయన ఎవరు?” అని మా నాయనమ్మను అడిగేవాడిని. ఆమెకు బాబా గురించి అసలు ఏమీ తెలియదు. ఆమె టీచర్‌గా పనిచేసేది. నాకు తెలియదు అని ఆమె ఎప్పుడూ చెప్పేది కాదు (నవ్వులు). ఎలిమెంటరీ స్కూలు టీచర్లు, పిల్లలకు “నాకు తెలియదు” అని ఎన్నటికీ చెప్పరు! (గురువుగారు నవ్వుతూ) అది సాపేక్ష సిద్ధాంతమైనా, మరే ఇతర ప్రశ్నైనా సరే వారు ఏదో ఒక జవాబు చెప్పి తీరుతారు. అందువల్ల నేను “సాయిబాబా ఎవరు?” అని అడిగినపుడు, ఆమె “ఆయనో పెద్ద శివభక్తుడు” అని చెప్పింది. ఆ ఫొటోలో ఓ చిన్న గుర్రం, పర్వతాలో లేక కొండలో ఉండేవి. పాత ఇళ్లలో చూస్తే ఆ చిత్రపటాలు ఇప్పటికీ కనపడుతూనే ఉంటాయి. “ఆయన ఏమి చేస్తున్నారు” అని అడిగాను నేను. “హిమాలయాల్లో తపస్సు చేసుకుంటూ వుంటారు”. “ఎవరికోసం ఆయన తపస్సు చేస్తున్నారు?” ఎందుకనంటే ఆ రోజుల్లో తపస్సు, గురించి మనకు సినిమాల ద్వారానే అవగాహన వుండేది (గురువుగారు నవ్వుతూ)! భూకైలాస్ లాంటి సినిమాల్లో శివుడు గురించి తపస్సు చేస్తాడు. కాబట్టి “ఆయన ఎవరి కోసం తపస్సు చేస్తున్నారు” అని అడిగాను. “శివుని కోసం” అని ఆమె ఠక్కున సమాధానం చెప్పింది. అందువల్ల, ‘ఆయనో శివభక్తుడు. హిమాలయాలలో వుంటాడు’ – ఇదీ ఆయన గురించి నాకున్నటువంటి ఊహ. అంతే! మా నాయనమ్మకు ఆయన గురించి ఏమీ తెలియదు. కనీసం ఆయన శిరిడీలో నివసించారని కూడా తెలియదు. నాకూ ఆయన గురించి ఏమీ తెలియదు. కానీ ఎందుకనో నాలో ఏదో ఒక భావన ఉండేది. మా ఇంట్లో పూజగదిలోకి నేను ఎప్పుడు అడుగుపెట్టినా ఆయనను ఇంకా ఇంకా ఎక్కువగా చూస్తుండేవాడిని. ఎందుకనో ఆయన నాకు నచ్చేవారు. ఆయన ఎంతో వాస్తవంగా, మామూలు వ్యక్తిలాగా, సులభంగా చేరువయ్యేవారిలా ఉండేవారు. మిగతా దేవుళ్ల రూపాలన్నీ నాకు వింతగా అనిపించేవి. అది నా మొదటి అనుభవం. అవే బాబా గురించి మొదటగా నాకు తెలిసిన వివరాలు కూడా. బాబా గొప్పతనం గురించి, ఆయన మహిమ గురించి నాకు ఎవరో చెప్పబట్టి ఆయన పట్ల నేను ఆకర్షితుడనవడం జరుగలేదు. ఆయన గురించి ఏ వివరాలు తెలియకుండానే నేను ఆయనపట్ల ఆకర్షితుణ్ణయ్యాను.

నేను బాబా చరిత్రను చాలా కాలంపాటు చదవలేదు. నేను శిరిడీ వెళ్లింది కూడా 1977లోనే. సద్గురువు గురించిగానీ, లేదా నాకు సహాయపడగలిగేవారు ఎవరా అనిగానీ, నాకోసం ఏదైనా చేసేవాళ్ళుగానీ, ప్రేమతో ఆప్యాయతతో నన్ను అర్థం చేసుకునేవాళ్ళు కానీ, పసిబిడ్డ ఏమైనా అడిగితే తల్లీతండ్రిలా ప్రతిస్పందించి సమకూర్చేవాళ్ళు గానీ ఎవరా అని ఆలోచించినపుడు నాకు బాబా రూపమే తట్టేది. నేను ఇతరత్రా ఆలోచించలేకపోయేవాడిని. ఏ సాంప్రదాయాలు, భక్తి, దేవుళ్ళు, దేవతలు, దేవాలయాలు... ఇటువంటి వాటికి సంబంధించిన ఎటువంటి ప్రభావాలు నా మీద ఉండేవి కాదు. ఇటువంటి వాటి ప్రభావాలు నా మీద లేకపోవడం నా అదృష్టం (గురువుగారు నవ్వుతూ) నా మనస్సు పరిశుభ్రమైన తెల్లని కాగితంలా వుండేది. అందుకని కేవలం బాబా రూపం మాత్రమే దానిమీద పడింది.

**భక్తుడు** : బాబా మీ సద్గురువు అని ఎప్పుడు గుర్తించారు?



**గురువుగారు :** నేను బాబాను ఆ విధంగా 'ఎంపిక' చేసుకోలేదు. ఫలానా అప్పుడు "ఇప్పటి నుండి బాబా నా సద్గురువు. నేను ఆయనను సద్గురువుగా స్వీకరిస్తాను!" ఇలా కాదు. "నా సద్గురువు" లాంటి పదాలు వాడాలి కాబట్టి అలా మాట్లాడాల్సి వస్తుంది. నా హృదయంలోని భావన అది కాదు. మీ సద్గురువు ఎవరు? అని మీరడిగితే – "అవును. బాబానే నా సద్గురువు!" ఆ పదం మీకు బాగా తెలిసింది కాబట్టి నేను దానిని వాడతాను. కాని నేను దానిని అలా చూడను. ఎందుకంటే అలా చెప్పడం – ఏదో పద్ధతి ప్రకారం అన్నట్లుంటుంది. నాకేదో అంతర్లీనమైనటువంటి వేరే ఏదో ఉద్దేశ్యమేదో ఉన్నట్లు, ఇదేదో సంబంధంలాగా, అందులో ఆయన నా నుంచి ఏదో ఆశిస్తున్నట్లు, నేనేదో చెయ్యాలన్నట్టు, ఏదో సిద్ధాంతంలాగా, తత్వంలాగా, వేదాంతంలాగా ఉంటుంది. నాకు అటువంటి భావన లేదు. నాకు సంబంధించినంత వరకు ఆయన నా సంరక్షకుడు. నాకు తల్లి, తండ్రి, తాతగారు అలాగన్నమాట.

**గురువుగారు :** నేను కాలేజీలో వున్నపుడు మా ఇంగ్లీష్ లెక్చరర్ అయిన ఒక ప్రొఫెసర్‌తో చాలా సన్నిహితంగా వుండేవాడిని. ఆధ్యాత్మిక పరంగా కాదుగాని, ఆయన నాకు గురువువంటివారు. నేనంటే ఆయనకు చాలా ఇష్టం. ఆయనకు ఎలాంటి ఆధ్యాత్మిక వాసన, భక్తి ఉండేది కాదు. ఆయన భరద్వాజ మాస్టర్‌గారి డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేవారు. మాస్టర్‌గారు ఇంగ్లీషు విభాగానికి హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా వుండేవారు. నేను ప్రతిరోజూ భరద్వాజ్ మాస్టర్‌గారితో కలసి కూర్చోవడం మొదలుపెట్టాను. ఎలాగైతే అంతకుముందు మా ఇంగ్లీష్ లెక్చరర్‌తో కలసి కూర్చునేవాడినో (కాకపోతే అప్పుడది ఎక్కువగా ఇంగ్లీష్ గురించి ఉండేది) అలాగ! ఆ సమయంలో మా ఇంగ్లీషు లెక్చరర్‌కు వేరే చోటుకు బదిలీ అయింది.ఆయన వెళ్లిపోయే ముందు ఒక షాపులో బాబా చిత్రపటం ఒకటి చూసాడు. భరద్వాజ మాస్టర్‌గారు సాయి భక్తులు కాబట్టి, ఆయన దానిని కొని మాస్టర్‌గారికి బహూకరించాడు. వారం పది రోజుల తరువాత మాస్టర్‌గారు ఆ చిత్రపటాన్ని నాకు బహుకరించారు. మా ఇంగ్లీష్ లెక్చరర్‌గారికి వీడ్కోలు పలకడానికి వెళ్లినపుడు ఆ చిత్రపటం నా దగ్గరే ఉంది. "నేను భరద్వాజ మాస్టర్‌గారికి ఇచ్చిన చిత్రపటం ఇదే. ఆయన దీన్ని నీకిచ్చారా?" అని అన్నారాయన. అది బాబా నన్ను మాస్టర్ గారికి అప్పగించడంలా అనిపించింది. అది నాకు మంచి సంకేతంలా తోచింది. నేను ఆ చిత్రపటాన్ని ఇంటికి తీసుకెళ్లాను. అప్పటికే మా ఇంట్లో చిన్న బాబా ఫొటో ఒకటి ఉండేది. కానీ ఈ ఫొటో చాలా పెద్దది. ఆ రాత్రి నేను ఇంటికి వెళ్లి ఈ ఫొటోను అక్కడ పెట్టాలనుకునేటప్పటికి, ఉండాల్సిన పాత బాబా ఫొటో ఆశ్చర్యకరంగా అక్కడ లేదు. ఫ్రేమ్ మాత్రమే వుంది. బాబా ఫొటో లేదు, ఫ్రేమ్ ఖాళీగా ఉంది.

**భక్తుడు** : ఎందుకని, ఏం జరిగింది?




**గురువుగారు :** ఏం జరిగిందంటే, ఎలుకలు (గురువుగారు నవ్వుతూ) అది చాలా పాత ఫొటో. ఎలుక ఫ్రేము నుండి బయటకు లాగి తినేసింది. ఆ తరువాత ఆ ఫొటో ముక్కలు కొన్ని ఒక మూల కనిపించాయి. ఇది సరిగ్గా అదేరోజు జరిగింది. వుదయాన్నే ఫొటో అక్కడుంది. నేను రాత్రి 1 లేక 2 గంటల ప్రాంతంలో కోట (నెల్లూరు వద్ద ఒక గ్రామం) కు తిరిగి వచ్చి పూజగదిలోకి వెళ్లేసరికి షాక్. ఇంట్లో ప్రతి ఒక్కరికీ షాకే. ఏం జరిగింది? ఏం జరిగింది? అని.

**భక్తుడు :** మీరు దానిని అశుభంగా భావించారా?

**గురువుగారు :** అవును. అది బాబా ఫొటో. తప్పకుండా అశుభమే! కానీ మరో పెద్ద ఫొటోలో బాబా అప్పటికే అక్కడున్నారు. సాధారణ హిందూ కుటుంబంలో మాదిరిగానే మా ఇంట్లో కూడా చాలా పటాలుండేవి. నేను అక్కడున్న మిగతా పటాలన్నింటిని ఒక ప్రక్కకు జరిపి పెద్ద బాబా ఫొటోను అక్కడుంచాను.

నేను ఆ గదిలో బాబాను చూస్తూ అలా కూర్చుండేవాడిని. అప్పటికి నాకు ఏ సాధనలూ తెలియవు. బాబా గురించి తెలియదు. ఆయన జీవిత చరిత్ర చదవలేదు. ఆయన సద్గురువని, ఆయనకు మహిమలున్నాయని, ఆయన నాకు సహాయం చేయబోతారని తెలియదు. నాకు తెలిసినదంటూ ఏమీ లేదు. కానీ ఆయన ముందు కూర్చున్నపుడు నన్ను ఎంతగానో బాధించే విపరీతమైన తలనొప్పిలాంటి భావనేదో తొలగిపోయేది. కాబట్టి నేను ఇంకా, ఇంకా, ఇంకా కూర్చోవలసిన అవసరం కలిగేది. నేను అక్కడి నుండి బయటకు వెళ్లిన తక్షణం అది తిరిగి మొదలయ్యేది. కాబట్టి నేను అలా గంటలు గంటలు కూర్చొనేవాడిని. అదేదో సాధనలాగా కాదు. మరెవరో చెప్పారని కాదు. నేను చెప్పేదేమిటంటే కేవలం నా అవసరం కొద్దీ నా శిరోవేదన మూలంగా అలా కూర్చునేవాడిని. శిరోవేదన అంటే నా ఉద్దేశ్యం కేవలం భౌతికమైన తలనొప్పి అని కాదు. నాకెలాంటి తలనొప్పులు వచ్చేవి కావు. అది వేరే రకమైనది, ఓ రకమైన అంతర్గతమైన తలనొప్పి.

**భక్తుడు :** మీ విషయంలో ఇది హఠాత్తుగా జరిగిందా? అంతకుముందు రోజు వరకు బాబాకు, మీకు పెద్దగా సంబంధం లేదు. కానీ తరువాత రోజుకు హఠాత్తుగా బాబా పూర్తిగా, సంపూర్ణంగా మీ ఆరాధ్య దైవమై పోవడం... అది ఆ విధంగా జరిగిందా?

**గురువుగారు :** నాకు తెలియనిది ఏదో ఉండేది. దేనిపట్లో ప్రేమ. నా మనస్సు దేనికోసమో పరితపించేది. నేను బాబాను చూసినపుడు "నేను ఇన్నాళ్లుగా వెతుకుతున్నది దీని కోసమే" అని తెలుసుకున్నాను.

**భక్తుడు :** బాబాను మీ ఆరాధ్య దైవం అని గుర్తించడంతోనే సరిపోయిందా? లేక అది కేవలం ఆరంభం మాత్రమేనా?

**గురువుగారు :** అది కేవలం ఆరంభం మాత్రమే.




**భక్తుడు** : దేనికి ఆరంభమిది?

**గురువుగారు :** దానిని (బాబానే ఆరాధ్యదైవం అన్న గుర్తింపును) ఇంకా ఇంకా వాస్తవం చేసుకోవడానికి చేసే ప్రయత్నానికి ఇది ఆరంభం. ఉదాహరణకు నీకు ఉండటానికి ఇల్లు అవసరమైనపుడు, మంచి ఇంటి కోసం చూస్తావు. దాని కోసం వెదకుతుంటావు. మంచి ఇల్లు ఎలా ఉండాలి అని నీకొక అవగాహన ఉంటుంది, నీవైన కొన్ని అభిప్రాయాలుంటాయి. దానివల్ల నీకు స్వంత ఆలోచనలుంటాయి. నువ్వు ఒక్కొక్క ఇంటిని చూస్తూ ఉంటావు. దాని కోసం వెదకుతుంటావు. అలా చూస్తున్నపుడు 'ఇది కాదు, ఇది కాదు' అనుకుంటూ, ఏదో ఒక ఇంటిని చూసినపుడు "దీని కోసమే చూస్తున్నది, సరిగ్గా ఇదే" అనిపిస్తుంది. కానీ అది అంతటితో ఆగదు. అది కేవలం ప్రారంభం మాత్రమే! ఆ ఇంటి యజమాని ఎవరో కనుక్కోవాలి. అద్దె ఎంతో తెలుసుకోవాలి. మన తాహతుకు సరితూగుతుందా? అసలు ఆ యజమాని దానిని అద్దెకు ఇస్తాడా అన్న విషయం కనుక్కోవాలి. ఇలా చాలా విషయాలుంటాయి. కాబట్టి అది కేవలం ఆరంభం మాత్రమే. ఒక విషయానికి అది చివర, మరొక దానికి ఆరంభం.

**భక్తుడు :** ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకమైన భద్రత కోసం వెతుక్కుంటూ వుంటారు. కొంతమంది దాన్ని (భద్రతను) సంబంధ బాంధవ్యాలలో, మరికొంతమంది కుటుంబం లేదా డబ్బులో .... ఇలా దేనిలోనైనా (వెతుక్కుంటారు).... ఈ ప్రశ్న కాస్త వింతగా వున్నా, నా మనసులో అడగాలనుంది. మీ భద్రత ఏమిటి గురువుగారూ!

**గురువుగారు :** బాబా

**భక్తుడు :** అందరూ వారి భద్రతను వేరే వేరే మార్గాలలో పొందినట్లు, మీ అవసరాల్ని బాబా ద్వారా తీరుతున్నట్లు మీరు అనుకుంటున్నారా?

**గురువుగారు :** నాకు దేనికీ కొరతగా ఉన్నట్టనిపించదు. బాబా నాకు అన్నీ ఇస్తారు. అది భద్రతకు మించినది. ఎందుకంటే, భద్రత అనంటే మనకు ఉన్నదానిని కాపాడటం లేదా రాబోయే ప్రమాదం నుండి కాపాడటం. కానీ బాబా కోరికలు తీర్చే కల్పవృక్షం. అది (ఆ కల్పవృక్షం) మనకున్న దానిని రక్షించడం, రాబోయే ప్రమాదాల నుండి కాపాడటం మాత్రమే కాదు, మన కోరికలు కూడా నెరవేరుస్తుంది.

**గురువుగారు :** అన్నింటికంటే ముఖ్యమైనది "నేను బాబాకు చెందినవాడిని. బాబా నా వారు!" అనేటువంటి ఆ అనుబంధం, ఆ అనుభవం, ఆ గుర్తింపు. అది చాలు! దానిని నువ్వు గుర్తు పెట్టుకున్నంత వరకు అదే నిజమైన స్మరణ అవుతుంది. **స్మరణ అంటే గుర్తుపెట్టుకోవడం.**

**భక్తుడు :** నేను బాబాను కోరినవి పొందడం, పొందకపోవడం మీద ఆధారపడకుండా, బాబా పట్ల ఆ అనుబంధం ఎప్పుడూ అలాగే ఉంటుందా?

**గురువుగారు :** నీకు అటువంటి అనుబంధం ఉంటే, ఒకవేళ బాబా ఇవ్వకపోయినా, ఆ అనుభవం చెరిగిపోదు.



ఉదాహరణకు, నీకో బిడ్డ వుంది. ఆమె తన స్కూల్ పరీక్ష పాస్ కావాలని నువ్వు ఎంతగానో అనుకుంటావు. కానీ ఆమె పాస్ కాలేదు. ఆ బిడ్డపట్ల నీ ప్రేమ పోతుందా? ఆ అమ్మాయిని ఇంకా ఎందుకు ప్రేమిస్తున్నావు? ఎందుకంటే ఆమె నీ బిడ్డ కాబట్టి! బాబా మనం అడిగింది ఇచ్చినా ఇవ్వకపోయినా నీకు ఆ అనుబంధం ఉంటే అది చాలు. అన్నీ జరిగిపోతాయి. అది చాలా సులభంగా అనిపిస్తుంది కానీ అంత సులువు కాదు. ఆ అనుబంధ భావనను వాస్తవం చేసుకోవడం కోసం ఆ గుర్తింపు కోసమే మనమందరమూ ప్రయత్నించేది.

**గురువుగారు :** "నేనెవరు" అనే విచారణ వ్యక్తి అస్తిత్వానికి సంబంధించినది. ఒక్కొక్కళ్లూ ఆ గుర్తింపును ఒకొక్క రకంగా అనుభవం చెందుతారు. "నేను ఆత్మను, నేను బ్రహ్మాన్ని, నేను సాయిబాబా బిడ్డను, నేను అరుణాచలేశ్వరుని కుమారుణ్ణి. నేను ఆయన వాడిని, ఆయన నా వాడు" ఇలా కొంతమంది అనుభూతి చెందవచ్చు. తనను ఏదో ఆవహించినట్టు అనుభూతి చెందానని రమణమహర్షి చెప్పారు. ఆయన 'ఆవేశం' అన్న పదాన్ని వాడారు. అది నీకు చెందింది కాబట్టి నువ్వు దానిని పొందాలనుకుంటున్నావు. అనుభవైకవేద్యం చేసుకోవాలనుకుంటావు. 'నాకే చెందాలి' అనుకోవడం అవాస్తవికమైనది కాదు. నిజానికి మనకంటే ఉన్నతమైన అస్తిత్వంతో లీనమవడం ఒక అందమైన భావన. మనలో ఆ గుర్తింపు భావన కలగడమే ముఖ్యం. నిజానికి మనలో పరివర్తన కలిగించేది అదే. ఎందుకంటే మనలో భావోద్వేగాలు, ఆలోచనలు దాని మీదనే ఆధారపడి వుంటాయి. మన గుర్తింపు మారడం, పరివర్తన చెందడం ప్రారంభమైన తరువాత మన అనుభవాలు, మన జీవితం మొత్తం పరివర్తన చెందడం ప్రారంభమవుతుంది. ఆ గుర్తింపే దానికి మూలం. అందుకే భగవాన్ "నేనెవరు? నేనెవరు? అని విచారించి నీవు ఎవరో తెలుసుకో. ముందు నీ అస్తిత్వం ఏమిటో తెలుసుకో" అన్నారు. మిమ్మల్ని మీరు గుర్తుంచుకోవడానికి ప్రయత్నించవద్దు. మీ గుర్తింపును తెలుసుకోండి. ఈ రెండింటికీ భేదం వుంది. అది ఏదైనా కానీ, మన ప్రస్తుత వునికిని కోల్పోతే తప్ప మన నిజమైన అస్తిత్వాన్ని పొందలేము. భగవాన్ అదేంటో చెప్పలేదు. కానీ మన నిజమైన వునికిని మనం తెలుసుకుంటే అది చాలు.

**గురువుగారు :** మనం ఏదైనా ఆనందం పొందినపుడు దానిని మనం మిగతావారితో పంచుకుంటాం. నేను సాయిబాబాలో ఓ నిధిని చూసాను. ఏదో అనుభవాన్ని పొందాను. మీరు ఇక్కడకు వచ్చినపుడు నా అనుభవాన్ని మీతో పంచుకుంటాను. నేను ఎవ్వరినీ పిలవను. అలా అని ఎవ్వరినీ కాదనను (తిరస్కరించను) ఎందుకంటే బాబానే స్వయంగా చెప్పారు – "మీ దగ్గరకు ఎవ్వరు వచ్చినా, నేను పంపానని గుర్తుపెట్టుకోండి" అని. వెనుకటి ఋణానుబంధం వలన మనం ఇక్కడ ఇలా కూర్చుని వున్నాం. నేను మిమ్మల్ని బాబా ప్రసాదంగా భావిస్తాను. మిమ్మల్ని అలా గౌరవించాలను కొంటాను. మీ కోసం నేను చేయగలిగినదంతా చేయాలి. అయినా నేను ఏం చేయగలను? పంచుకోవడం తప్ప. నేనదే చేస్తున్నాను. ఇదంతా బాబా పట్ల నాకు గల ప్రేమకు వ్యక్తీకరణే!

# అమృతములు : నావాణి




ప్ర : మాస్టర్ ఇ.కె.గారు మృతి చెందారని విన్నాం.

స : అవును, స్మృతి చెందారని భావిస్తున్నాం

ప్ర : ఆయన లేరు, ఇక మీకు దిక్కెవరు?

స : దిక్కులు తెలిసినవారం, దిక్కులు చూసినవారం, దిక్కులు తోచక తిరగం, నలుదిక్కుల ఆయన ఆశీస్సులతో (అనుగ్రహంతో) వ్యాపిస్తాం.

ప్ర : వారు తలపెట్టిన కార్యక్రమాలన్నీ ఆగిపోతాయా?

స : సాగిపోయే కార్యక్రమాలను వారు సంకల్పించి, ఆచరించి చూపించారు. కనుక సాగిపోతుంటాయి గాని ఆగిపోవు.

ప్ర : మీరందరూ నిరాశ్రయులు అయిపోయిరి గదా!

స : నిరాశను ఆశ్రయించే వారే నిరాశ్రయులు. అది మాలో కలుగలేదు.

ప్ర : ఇంత పని జరుగుతుందనుకోలేదు సుమా!

స : జరగవలసిన పని అంతా జరిగింది. జరుగవలసిన పని జరుగుతుంటుంది. ఒక పని జరిగిన తరువాతే ఇలా జరిగింది అని చెప్పుకోవడం సాధ్యం అవుతుంది.

ప్ర : ఆయన ఏ పనీ పూర్తి చేయలేదని మాకు అనిపిస్తుంది. మీరేమంటారు?

స : ఆయన ద్వారా జరగవలసిన పని నిస్సంకోచంగా ఆయన ద్వారా లోకానికి ప్రసాదించబడింది.

ప్ర : జీవితంలో మీరందరూ ఇంకేమి సాధించగలరు?

స : సంఘాన్ని, లోకాన్ని ఉద్ధరిస్తున్నామని ప్రజల్ని మాత్రం సాధించుకుతినం. మేం చేయగలిగింది హృదయపూర్వకంగా చేస్తుంటాం.

ప్ర : మీకు నాధుడు లేకుండా పోయాడే?

స : అనాధుల్ని మాత్రం చేసిపోలేదు. పునాదులన్నీ వేసి భవనాలను నిర్మించే వెళ్లారు.

ప్ర : మాస్టర్ ఇకె గారి స్మారకార్థం మీరేం చేయదలచుకున్నారు?

స : జీవితాన్ని సార్థకం చేసుకుందామనే ప్రయత్నం చేస్తున్నాం.

**"బంధుమిత్రులను వదిలిపెట్టండి" అంటే అర్థం - వారిని కేవలం బంధుమిత్రులుగా చూడటం విరమించండి! వారిలోకూడా దైవాన్ని చూస్తూ ఆనందించండి, అని అర్థం. అప్పుడు బంధుమిత్రులు ఉండటం దైవాన్ని అర్చించుకోవడానికి ఒక అవకాశం అవుతుందే కాని అడ్డు కాదు. మళ్లీ ఇక్కడొక సూక్ష్మమున్నది. వారిలో దైవాన్ని చూడాలి మనం, మనలో వారు దైవాన్ని చూడాలని ఈలోగా ఇబ్బంది పెట్టకండి. మనలాగే వారు కూడా సాధనలోకి వస్తారు. ఇలా బంధుమిత్రులందరూ మన సాధనకు ఉపకరించేందుకే వున్నారు.**




# జ్ఞానరత్నాలు

నేను మీ చేతికి ఒక లక్షరూపాయలిచ్చి, హైదరాబాద్‌లో ఎవరికో ఇవ్వమన్నాను అనుకో, వెంటనే బయలుదేరి వెళ్లు అన్నాను. దారిలో మీరు ఎట్లా గుర్తుపెట్టుకుంటారు దాన్ని. అది విలువయినదయితే ప్రయాణం చేస్తున్నా, ప్రక్కన వాళ్ళతో మాట్లాడుతున్నా, అప్పుడప్పుడు అక్కడ తడుముకుంటూ వుంటావు. అది వుందో లేదో, ఎవరయినా కొట్టేసారేమో అని. (నవ్వులు) అలా అది నీ బుర్రలో ఒక వైపు వుండిపోతుంది. అట్లా, అట్లా వుండాలి బాబా అది పోయే కొద్దీ పోయే కొద్దీ ఎట్లా అవుతుందని అంటే, ఇప్పుడు నేను మాట్లాడుతుంటే నా మాటలు వింటున్నారు మీరు. ఒకసారి నేను మాట్లాడటం ఆపాను., ఒక్కడ ఎవరో మైకు పెట్టి వున్నారు, అవి వినిపిస్తాయి. మరలా నేను మాట్లాడాను. అవి వినిపించవు, ఇవి వినిపిస్తాయి. ఇప్పుడు నేను మాట్లాడేటపుడు అవి వినిపించడం లేదా! వినిపిస్తున్నాయి. కీచురాయి శబ్ధం, ఫ్యానుశబ్ధం, మైకు శబ్ధాలు వినిపిస్తూనే వున్నాయి. కాని మన దృష్టి వాటిపైన లేదు, బాబా యొక్క స్ఫురణ (స్మరణ) మనకు అలా వుండాలి, ఆ కీచురాయి (శబ్ధంలా) సౌండ్‌లాగా వుండాలి. మనం చేసేటువంటి పనులన్నీ కూడాను ఇప్పుడు నేను మాట్లాడే మాటల్లాగే వుండాలి. పనులు చేస్తున్నంతసేపు వాటి మీద వుంటుంది. పని ఆపాము. ఆ కీచురాయి శబ్ధంలాగా బాబా మీద నిలిచిపోవాలి. అది సాధించాల్సింది. ఈ లోపల గుర్తుపెట్టుకునేదానికి ఇది. మీకందరికి బాబా అనే లక్షరూపాయలిచ్చా. ఊరక నేను ఉదాహరణగా చెప్పడం కాదు. దాన్ని అజాగ్రత్తగా పారేసుకుంటారా! జాగ్రత్తగా తడుముకుంటూ, చూసుకుంటూ పోతారా?

*– పూజ్యశ్రీబాబూజీ సత్సంగం నుండి సంగ్రహించబడినది*

## గురువు - వెలుగు

**గురువు యొక్క సాంగత్యము ఆధ్యాత్మిక సాధనలో తప్పనిసరియే. కాని అంత మాత్రమున శిష్యునకది బంధము కారాదు. గురువనగా వారి దేహము కాదనియు, పరమ ప్రేమయగు వెలుగే గురువనియు, ఆ వెలుగు మనలో వున్నదనియు, పైగా విశ్వమంతటా వ్యాపించియున్నదనియు, భౌతిక రూపమెత్తిన గురువును నిరంతరం స్మరించుచు, వారుపదేశించిన మార్గమున నడుచుచున్న యెడల మన(లోని)తోనే గురుసాన్నిధ్యము సదా ప్రకాశించుననియు బోధపడుచున్నది. భౌతికమైన ఎడబాటుకు దుఃఖించుట ప్రేమకాదనియు, వట్టి ఉద్వేగము, మనో దౌర్బల్యమనియు బోధించుచుండిరి.**

**వారి సంస్మరణతో, వారి ననుసరించుటతో వారి సాన్నిధ్యము సదా సిద్ధించును. గురుని పలుకులు ఒక్కొక్కసారి వేణుగానముగా, నవనీతమువలె నుండును. ఒక్కొక్కసారి శంఖారావముగా నుండును. ఒక్కొక్కసారి చెంద్రకోల తాకిడివలె నుండును. అన్ని విధములుగా అది అనుగ్రహించుటయే. ఇదంతయూ మానసికముగా తమ భౌతిక వియోగమునకు, దివ్య సాన్నిధ్యమునకు సంసిద్ధపరచుటలో భాగమని ఎరుకపడినది.**

# జ్ఞానరత్నాలు




ఎవరో అడిగారు, ఎందుకండీ వూరికే అన్ని చార్జీలు పెట్టుకుని శిరిడీకి పోవడం, 1000, 500రూ॥లు పెట్టి పేదవాళ్లకు అన్నం పెట్టొచ్చు కదా! అన్నంలేని వాళ్లకు. బాబా అంతటా వున్నాడు, సర్వత్రా వున్నాడు కదా! దానికి శిరిడీకే పోవాలా? అని అడిగాడు. అంతటా బాబా అందరిలోనూ వున్నాడు. ఆ ఆకలిగొన్న జీవికి అన్నంపెడితే బాగుంటుంది అన్న విషయాన్ని నేర్చుకోవడానికే నేను శిరిడీ పోతున్నానని చెప్పా. అట్టా పోకపోతే ఎవడన్నా పెడుతున్నాడా పోని, ఈ మాట చెప్పినవాడు పెడతాడా? ఎప్పుడన్నా పెట్టాడా? చూడండి. ప్రశ్నలు అడుగుతుంటారు. ఏం శిరిడీకే పోవాలా? బాబా ఇక్కడ లేడా? ఆకలిగొన్న జీవికి ఆ అన్నవాడు ఎప్పుడన్నా 100రూపాయలు కాదు, 50 రూపాయలన్నా పెట్టి సహాయం చేసాడా? చూడండి. అది మనమే మిగుల్చుకున్నామనుకోండి, 1000 రూపాయలు శిరిడీకి పోకుండా ఎంత సద్వినియోగం చేస్తున్నావో ఆలోచించి చూడండి ఒక్కసారి. శిరిడీకి రావడం ఎందుకు అని అంటే దాన్ని నేర్చుకోవడానికి. మనకి ఇప్పుడు రకరకాల బలహీనతలున్నాయి, రకరకాల వ్యామోహాలున్నాయి, అబద్ధాలు చెబుతున్నాం, ఇంకా ఎన్నో రకాల వ్యామోహాలున్నాయి. వాటిని చూసి మనం సిగ్గుపడుతున్నాం. వాటిని పోగొట్టుకోవాలి.

ప్రతి మనిషి వాడి యొక్క బలహీనతలు పోగొట్టుకోవడం కోసంగా తపన పడుతునే వుంటాడు. కొంతమంది కొంతవరకు సఫలీకృతులవుతారు, కొంతమంది సఫలీకృతులు కారు. సఫలీకృతులు కాలేనటువంటివాడు, దాన్ని పోగొట్టుకోవడానికి బలం సంపాదించడం కోసంగా ప్రయత్నం చేస్తాడు. ఆ ప్రయత్నమే ఇది. మహాత్ములైనటువంటి వాళ్లకి ఏం అవసరం. అసలు ఈ సాధన, ఈ సత్సంగం శిరిడీ యాత్రలు ఇవి అంతా కూడాను, మనం మహాత్ములం కాదు. మనలో బలహీనతలున్నాయి. పోగొట్టుకోవలసినవి ఎన్నో వున్నాయి. *– పూజ్యశ్రీబాబూజీ సత్సంగం నుండి సంగ్రహించబడినది*

**గురుదేవులు మన ఊహకందని దివ్య ప్రణాళిక నిర్వహణకై తమ భౌతిక దేహమును విడిచిపెట్టిరి. లోక కళ్యాణార్థమై ఇట్లు విడిచిపెట్టుట సాయి ఆదేశమై వున్నది. వారిని స్మరించి, శరణాగతులై, వారి ఆచరణననుసరించిన వారికి వారి సాన్నిధ్యము సదా రక్షయై నిలుచును. అది అతి మధురము.**




# దక్షిణ

షిరిడీ ఒక పల్లె, బాబా రాకతో అది బస్తీ అయినది. అందున్న శిధిలమైన మసీదు ద్వారకామాయిగా మారి దర్శనీయమైనది. బాబాకది నెలవు. అందే ఆయన కొలువు. తదాపి భక్తుల కది కోరికల కోవెల. ఉపశమింపచేయు ఊయల. ఒకనాడు బొంబాయి నగరము నుండి ధనికుడైన వ్యాపారి ఒకడు సాయిబాబాను సందర్శించుటకు వచ్చారు. సాయికి సాష్టాంగప్రణామము చేసి, పూలమాల వేసి, పండుకోసి బాబా చేతిలో పెట్టాడు. ఆరు నెలల నుండి రావాలని ఆతృత. కానీ రోజువారి రాబడి రానివ్వట్లేదు. “అల్లా తనకు కావలసిన వారి కాళ్లకు దారము కట్టి లాగి రప్పించుకుంటాడు” అన్నారు. నా చెంత కూర్చో. చింతలు, వంతలు తీరుతాయి అని ముక్తాయించారు బాబా.

అంతట శేఠ్‌జీ ఉబ్బి, తబ్బిబ్బయి, బాబా చెంత చేరాడు. వాని చేతి వ్రేళ్ళకున్న బంగారపు టుంగరములోని విలువైన రాళ్ళు తళతళ కాంతులీనుతున్నవి. పావుగంట అయిన తరువాత వాని చెవిలో “దక్షిణలేని తాంబూలము, శిక్షణలేని శిష్యుడు ఒకటే” అన్నారు బాబా. “మరచిపోయాను, మన్నించాలి” అంటూ కొన్ని చిల్లర నాణెములు బాబా చేతిలో పెట్టారు. భక్తులు వస్తున్నారు, ప్రణమిల్లుతున్నారు, ప్రస్తుతులు చేస్తున్నారు, ప్రాథేయపడుతున్నారు, పండ్లు, ఫలహారములు మెండుగా వస్తున్నవి. అవి అందరికీ పంచిపెట్టబడుతున్నవి, శేఠ్ చెవిలో “దక్షిణ యివ్వగలవా” అన్నారు మెల్లగా బాబా. ఇసుమంత ఇచ్చినచో, ఇతోధికముగా లాభాలు పెరుగునని ఆశతో శేఠ్‌జీ మరికొన్ని చిల్లర నాణెములను బాబా చేతిలో పెట్టాడు. వాని ఉంగరములు ధగధగమని మెరిసినవి. బాబా ఆ నాణెములను గల గల మనిపించి తన భిక్షాపాత్రలో వేసారు. సంభాషణలు, సంస్తుతులు, సాష్టాంగ నమస్కారములు సాగుతున్నవి. ద్వారకామాయిలో భక్తులు కిటకిటలాడారు. బాబా అందరినీ పలుకరించి, చిరునగవులను చిలకరిస్తున్నారు. అర్ధగంట గడిచినది. బాబా ఆ వ్యాపారితో కడుమెల్లగా “దక్షిణ ఇవ్వాలని వున్నదా” అన్నారు యుక్తిగా. భక్తితో తల ఆడించి, కుడిజేబులో చేయిపెట్టగా, మడత పెట్టబడిన కాగితము తగిలింది శేఠ్‌జీ వ్రేళ్లకు. దానిని తీసి బాబా చేతిలో పెట్టాడు ధనికవ్యాపారి. అది ఆనాటి కాలములో వందరూపాయల నోటు. “చేయిజారి పోయిందే” అని శేఠ్‌జీ నిట్టూర్పు విడిచారు. వంద రూపాయలనోటు బాబా భిక్షపాత్రలో రెపరెపలాడింది. తహతహలాడింది వ్యాపారి మనస్సు. “గీచి గీచి దానమిస్తే అల్లా తూచి తూచి మరీ ఇస్తాడు” అన్నారు హాస్యంగా బాబా. మరొక అర్ధగంట గడిచినది కానీ బాబా మరల దక్షిణ అడుగలేదు. హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు వ్యాపారి. మరొక అరగంట కాలమైంది.

“చందనపు చెట్టు అడిగించుకోకుండానే పరిమళ భరితమైన గాలినిస్తున్నది. సజ్జనుడైన ధనవంతుడు కూడా అంతే! ఏమంటావు శేఠ్‌జీ” అన్నారు బాబా. వ్యాపారి వ్యాకులచిత్తుడైనాడు. “చిత్తమని” చిన్న




నాణెములను జేబులోనే లెక్కించి బాబా చేతిలో పోసారు. "నీ చేతికి ఎముక లేదయ్యా" అన్నారు చిరునగవు చిందిస్తూ బాబా, "వాని చేతికి ఎముక వున్నదో లేదో గానీ, మీరడగడానికి అంతు లేనట్లుంది బాబా" అన్నాడు భక్తుడు నానా. "నానా! లేనా-దేనా" అనగా ఇచ్చిపుచ్చుకోవడాలు ద్వారకామాయికే చెల్లు. నా మాట పోదు పొల్లు" అన్నారు బాబా హాస్యంగా. ఇలా అరగంట, అరగంటకు బాబా అడిగీ అడగనట్లుగా వ్యవహరించారు. వ్యాపారి కూడా ఏమీ పట్టనట్లుగా, పట్టి పట్టి దక్షిణలు మరీ ఇస్తున్నారు. భక్తులందరికీ సరదా సన్నివేశమైంది.

మధ్యాహ్న కాలమైంది. చేరువలో నున్న బాబా చెలికాడైన కుక్క ఆకలి రాగమాలపించింది. "మరచిపోలేదు భయ్యా! నీ కోసమైనా భిక్షమెత్తాలి కదా - ఆగు" అన్నారు బాబా అనునయంగా. భక్తులు బాబాకు మధ్యాహ్న హారతి ఇవ్వడానికి లేచారు. జేగంట వినిపించక మునుపే సాయి శేర్‌జీతో "నీ జేబులోని బరువుకు, నా నోటి కరువుకు ఏదో సంబంధముందయ్యా" అన్నాడు కన్నులు చికిలిస్తూ. శేర్‌జీకి ఆక్రోషము, ఉక్రోశము పెల్లుబికినవి. జేబులోని దంతయూ ఊడ్చి, బాబా చేతిలో పోసారు. జేగంటల మధ్య హారతి ఇచ్చారా భక్తులు. తమ తమ ఇండ్లకు బయలుదేరారు. "నానా! శేర్‌జీ ఘరానా వ్యాపారి. కానీ మొహమాటమెక్కువ. గారెలు, బూరెలతో పసందైన విందు భోజనము పెట్టమని", బాబా తాను భిక్షా పాత్రతో బయలుదేరారు. వ్యాపారికి వ్యవహారమంతయూ సరిగా లేదు, కసికసిగా వుంది. జేబులు ఖాళీ అయినవి. బయటపడటమెట్లా, బొంబాయికి చేరడమెట్లా? అనెడి చింతన మొదలైనది. తిరిగి అందరూ ద్వారకామాయి చేరుకున్నారు. శేర్‌జీ ఒక మూల ఒదిగి కూర్చుందామని భావించారు. బాబా వానిని మరల తన ప్రక్కనే కూర్చుండబెట్టుకున్నారు. ఒక భక్తుడు సుశ్రావ్యంగా భక్తిగీతము లాలపించు చున్నాడు. అందరూ మైమరచిపోయారు. పాటల తరువాత బాబా "భగవంతుడి ఎదట ఎదలోని భారమంతటినీ వాని పాదముల మీద పెట్టాలి. అప్పుడే శాంతి, విశ్రాంతి" అన్నారు. వ్యాపారివైపు "దక్షిణకు ధనమునే గాదు, దానికి బదులుగా వస్తువులనిచ్చినా పుచ్చుకుంటాను" అని బాబా వాని చేతి యుంగరముల వంక చూసారు. "హతోస్మి" అని నిట్టూర్చి శేర్‌జీ వ్రేళ్లకున్న పాత, కొత్త బంగారు వుంగరములను బాబా భిక్షాపాత్రలో వేసాడు. "మరిక బయటపడుట ఎట్లా" అని పరిపరి విధములుగా ఆలోచిస్తున్నాడు వ్యాపారి. మరొక ముప్పావుగంట జరిగినది. "ఇంతవరకు లేదనకుండా, కాదనకుండా ఇచ్చావు, సంతోషము. అదేమిటో దానబుద్ధి వానిని చూస్తే దక్షిణ అడగాలనిపిస్తుంది నాకు, ఏమంటావ్ శేర్‌జీ" అన్నారు బాబా ముసిముసిగా నవ్వుతూ, కన్నులు మూసుకున్నాడు వ్యాపారి. మ్రొక్కి పోదామని వచ్చిన తనను ప్రక్కన కూర్చుండబెట్టుకొని, ఒక్కొక్కటే గుంజి, చక్కని తిరుక్షవరము చేశాడీ బాబా. జేబులో చిల్లిగవ్వలేదే, చేతి వుంగరాలు లేవు, తిరుగు ప్రయాణమెలాగా? అని తను పరితపించుతుంటే మరల దక్షిణా? బాబా ఊరుకున్నారా? లేదు. "శేర్‌జీ! నీకేమిటి కొదువ? పెరుగుతున్న మేడలున్నవి, అద్దెలు తెచ్చెడి మిద్దెలున్నవి,

తోటలు, దొడ్లు సరేసరి! వీటిని నాకు దానమిచ్చి దఖలు చేయగలవా?" అని రెట్టించారు బాబా. ఒడలు మండినది శేఠ్‌జీకి. కసి బుసలు కొట్టినది. మోసము, పచ్చిమోసము, పిసరు పిసరుగా అడుగుతూ అసలుకే ఎసరు పెట్టాడే? అందరూ వానివైపు చూస్తున్నారు.

"చిత్తము-దఖలు చేస్తున్నాను; ఇందులో తప్పేమున్నది? తప్పేది ఏమున్నది?" అన్నాడు అక్కసుగా ఆ శేఠ్‌జీ. బాబా చాపిన చేతిలో చేయి వేసారు శేఠ్‌జీ. నిముషములు నీరసంగా గడుస్తున్నవి. ముప్పావుగంట అయినది. బాబా మెల్లగా "శేఠ్‌జీ సిగ్గువిడిచి అడుగుతున్నాను, దక్షిణ ఇచ్చుకోవా" అన్నారు. ఆ స్వరములో నమ్రత, విధేయత, దీనత, ఆత్మీయతలు జాలువారుతున్నవి. వ్యాపారి రక్తము సలసల మరిగినది. పండ్లు పటపటమన్నవి. గుండె కటకటలాడినది. ఒక్కఉదుటున లేచి, "స్వామీ! చిల్లర డబ్బుల నుండి స్థిరాస్తుల వరకు దొరకపుచ్చుకున్నావే, ఇంకా తృప్తి కలగలేదా? ఇంకేముంది నా బొంద, నేను మిగిలాను కావాలా?" అన్నాడు ధనికుడు కటువుగా. ఈ విసురు మాటల కందరూ విస్తుపోయారు. "తస్మాత్ జాగ్రత్త" అన్నట్లు కుక్క భౌభౌమన్నది. బాబా మెల్లమెల్లగా, అతి మెత్తగా "ఎందుకురా నాయనా, అంత విసుగు, విసుర్లు నాకు కావలసినది అదేరా! - ఏదీ! "నేను మిగిలాను" అన్నావే, అది నాకివ్వరా, ఆ బంగారపు పలుకులకై ఇంత నాటకమాడాను. ఆ మాట నన్ను నేను సమర్పించుకుంటున్నాను బాబా, గ్రహించు, అనుగ్రహించమని మొదటనే అంటే, నేనెంత సంతోషించేవాడినిరా! నాకు నీవే కావాలిరా, నీవు నావాడివైతే నీ సర్వస్వమూ నాదే కదా! భగవంతుడికి ఇవ్వవలసినది - నీకున్నది కాదురా, నీలోనున్న 'నేను'ను ఇవ్వరా! ఎనిమిది సంవత్సరముల క్రితం కటకటలాడే పరిస్థితులలో నకనకలాడే కడుపుతో నా పటము ముందు నిలబడి కన్నీరు పెట్టావు, కనికరించమన్నావు, చిటికెడు చక్కెర పెట్టావు గుర్తుందా? నాటినుండి నిన్ను అక్కున చేర్చుకున్నాను, అక్కరలు తీర్చాను, ఏటేటా వచ్చే లాభములు చూపి ఇదంతా నీదే బాబా అన్నావు, తీరా ఇప్పుడు నేను అడిగితే కసుర్లూ, విసుర్లూనా, నిన్ను నాకు సమర్పించుకోరా, సంతోషిస్తాను. దక్షిణ, దక్షిణ అని దప్పిక కొన్నవాడిని అని అనుకున్నావు కదా! నీ అహంకారమును ఆ ధునిలో వేయి. నీ ఐశ్వర్యమును అల్లాకప్పగించు. ఇదిరా అసలు దక్షిణ. ఆ దాక్షిణ్యపు బుద్ధి మీ అందరికీ నేర్పడానికి సిగ్గువిడిచి, చేయిచాచి, నోరు తెరచి అడుగుతున్నాను. తీసుకో, నీవు దానముగా ఇచ్చినదంతా జేబులో వేసుకో, ఫకీరును, భగవంతుడి తరపున అడుగుతున్నాను. నిన్ను సమర్పించుకోరా నాయనా!" అన్నారు బాబా. ధనికునకు వెన్ను తట్టినట్లయింది, కనులు తెరిపించినట్లయినది.


సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**

సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**

**గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన**

mail ID : **gurukrupa@saimail.com**

# (ని)దర్శనం

మాది నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం. బోధన్ సత్సంగ సభ్యురాలిని. మావారు ఎస్‌బిహెచ్ సాటాపూర్ బ్రాంచిలో హెడ్ క్యాషియర్‌గా పనిచేస్తూ ఎన్నోసార్లు ప్రమోషన్‌కి అప్లైచేసినా ఏదో ఒక అవాంతరం వల్ల ఆయన వ్రాత పరీక్షకి హాజరు కాలేదు. ఈసారి హాజరు అవ్వకపోతే మళ్లీ చాన్స్ రాదట. ఈసారి దరఖాస్తు చేయడం, వ్రాత పరీక్షకి హాజరు అవడం జరిగింది. ఇంటర్వ్యూకి హాజరు అవ్వడం కోసం ప్రిపేర్ అవుతున్నారు. సెప్టెంబర్ 12వ తేది సోమవారం ఒక ఫోన్‌కాల్ వచ్చింది. తిరుపతి నుండి గురుబంధువైన పవన్ కుమార్ ఫోన్ చేసి ఆంటీ! మాకు స్వీట్స్ ఎప్పుడు పంపుతున్నారు అని అడిగాడు. ఎందుకురా అని అడిగాను. నిన్న రాత్రి నాకొక కల వచ్చింది. ఆ కలలో గురువుగారు అంకుల్‌కి బ్లెస్సింగ్స్ ఇస్తున్నారు. అంకుల్ గురువుగారితో ఏదో చెపుతుంటే గురువుగారు తలఊపుతూ వింటున్నారు. అయితే కొంచెం దూరంలో మీరు అందరికీ స్వీట్స్ పంచుతున్నారు. తరువాత అంకుల్ ప్రక్కకి వచ్చాక అంకుల్‌ని నేను అడుగుతున్నాను "అంకుల్ మీరు తిరుపతికి రావచ్చు కదా అంటే అంకులేమో తిరుపతికేగా అంటున్నారు" అని పవన్ చెప్తున్నాడు. ఆ అబ్బాయి అలా చెపుతుండగానే నా కళ్లవెంట నీరుకారుతున్నాయి. ఎందుకంటే ఇంటర్వ్యూ సెప్టెంబరు 15న హాజరు అవ్వాల్సి వుంది. అంటే ఇంటర్వ్యూకు మూడు రోజులు ముందుగానే నా భర్తకు ప్రమోషన్ వస్తుందని గురువుగారు నాకు పవన్ ద్వారా చెప్పించారు. గురువుగారు సమాధిరూపులు అయ్యాక నాకు ఎంతో బెంగగా అనిపించేది. బాబా నా స్వామిని ఎందుకయ్యా అంత త్వరగా తీసుకెళ్లావు? ఆయనతో నీకంత ముఖ్యమైన పనేంటయ్యా అని ఎన్నిసార్లు ఏడ్చానో నా స్వామికే ఎరుక. "నేను ఎక్కడికీ వెళ్లను. నీ దగ్గరే వున్నాను చూసుకో" అని ఒక నిదర్శనం చూపించారు. ఈ సంఘటన తలచుకుంటే ఇప్పటికీ నా కళ్లవెంట కన్నీరొలుకుతూనే వున్నాయి. ఏమయినా నయనానందకరమయిన స్వామి భౌతిక రూపం నా కళ్లముందు తళుక్కున మెరిసి మురిపించేది. నా కళ్లకి, మనసుకి ఆనందాన్నిచ్చిన ఆ రూపం మళ్లీ ఎప్పటికీ కనిపించదు కదా, అనే బాధ నేను మరణించేంతవరకు వుంటుంది కదా! నా స్వామిని మళ్లీ ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఏ రూపంలో చూస్తానో, ఆయన తన వద్దకు తీసికొని దివ్యదర్శనం ప్రసాదిస్తే తప్ప మళ్లీ ఆయన దివ్య సన్నిధి ఎప్పుడు దొరికేనో?

ఒకప్పుడు నా ఇల్లు దేవుళ్ళ పటాల దుకాణంలా వుండేది. అంతమంది దేవుళ్లను పూజించేదాన్ని. వారందరిలో బాబా కూడా ఒకరిగా వుండేవారు. ఒకప్పుడు నా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చాయి. అప్పుడే బాబా మా పొలంలోను, ఇంట్లోను నేను మెలకువగా వున్నపుడే దర్శనం ఇచ్చారు (మనుష్యులను చూసినంత స్పష్టంగా) నేనున్నాను, అన్నీ నేను చూసుకుంటాను అని స్పష్టంగా మాటిచ్చారు. అలానే చూసుకున్నారు. ఎంతగా బాబానే ఆరాధించేదానిని అంటే 2000 సం॥ గురువుగారు మా ఇంటి ముందు నుండే బాబా ఆలయ ప్రతిష్ఠాపనా కార్యక్రమానికి వెళుతున్నా బయటకు వచ్చి చూడలేనంత. ఇంట్లోనే వుండి శరత్‌బాబూజీ అంట శరత్‌బాబూజీ. బాబా వుండగా ఈయనెందుకో మధ్యవర్తిత్వం అని నా మనస్సులో అనుకుంటూ బాబాకి హారతి ఇచ్చాను. 1996లో బాబా దర్శనానికి శిరిడీ వెళ్లి వెంటనే బయలుదేరి వచ్చేసాము.





ఆ తరువాత ఎన్నో సమస్యలు వచ్చాయి. అపుడు బోధన్ శ్రీనివాస్‌గారు గురువుగారి గురించి చెప్పి నాకు అడ్రస్ ఇచ్చి శిరిడీకి వెళ్లమని ప్రోత్సహించారు. శిరిడీ వెళ్లాను, గురువుగారు శిరిడీలో లేరు. ఆ సమయంలో నేనెలా వున్నానంటే బాబాను ప్రత్యక్షంగా చూసిన ఆనందంలో వున్నాను. బాబా నాకు కనిపించారని గురువుగారితో చెప్పడానికి శిరిడీ వెళ్ళాను. అమ్మగారు వున్నారు. అమ్మగారికి చెప్పగానే నవ్వారు. గురువుగారికి తెలుస్తుందిలే అన్నారు. నారా అంకుల్ సత్సంగంలో ఈ అనుభవం చెప్పమన్నారు, చెప్పాను. గురువుగారితో చెప్పలేదే అనుకుంటూ, లాకర్‌కి వెళ్లి పరుపుమీద ఊర్కే కళ్లు మూసుకుని అలా కూర్చున్నాను. వెంటనే గురువుగారు పరుపుమీద బాసింపట్లు వేసుకుని కూర్చుని చెప్పమ్మా అంటున్నారు. ఆశ్చర్యంతోనే టకటకా బాబా కనిపించిన విషయం చెప్పగానే సరేనమ్మా అని మాయమయిపోయారు. నేను ఎంత ఆనందాన్ని పొందానో మీరే అర్థం చేసుకోండి. అది గురువుగారి మొదటి దర్శనం. అయినా ఆయన్ని నేను గురువుగా అంగీకరించలేదు. చాలా రోజుల వరకు ద్వారకామాయికి వెళ్లి బాబా నేను మిమ్మల్ని ప్రత్యక్షంగా చూడలేదు. ఏ సేవ చేయలేదు. మిమ్మల్ని ఎక్కడ వెతకాలయ్యా అని ఎంతో ఏడ్చేదాన్ని. నా ఏడ్పుకు స్పందించినట్లుగా నన్ను గురువుగారి దగ్గరకు పంపారు. ప్రపంచంలో ఎన్ని రకాల ఆనందాలుంటాయో, అన్ని రకాల ఆనందాల్ని గురువుగారు నాకు అనుభవాలిచ్చారు. ఇప్పుడు నేను ఆనందాన్ని మర్చిపోయాను. గురువే సర్వస్వం అయ్యారు. ఇప్పుడు నన్ను చాలా మంది అడుగుతుంటారు. ఏమనంటే గురువుగారికే నమస్కరిస్తారు, బాబాకి నమస్కరించరేం అని. అలా గురువుగార్కి ఇష్టం వుండదు కదా అని. బాబానే చెప్పారు కదా, గురువుని తెలుసుకో, పూజించుకో అని. గురుపూర్ణిమరోజు బాబా దాదా కేల్కర్‌తో అంటారు ఆ స్థంబాన్ని పూజించుకోండి , ఆయనే నన్ను పూజించుకోండి అని చెప్పలేదు, ఇంక బాబానే ఆయన ఉఛ్వాస నిశ్వాసాలుగా చేసుకున్న గురువుగారు నన్ను పూజించమని చెపుతారా? ఈ సందర్భంగా గురువుగారు సాయిభక్తి సాధనారహస్యంలో చెప్పిన సమాధానం గుర్తు చేసుకోవడం సముచితం అని నాకు అనిపిస్తుంది. “గురువు ఎన్నడూ తనను తాను నీకు గురువుగా చేసుకోడు. ఆయన్ను గురువుగా గుర్తించేది నువ్వే” అని బాబా స్పష్టంగా చెప్పారని గురువుగారు వ్రాసారు. అటువంటపుడు మనకు జరిగిన అనుభవాలే వారిని మనకు గురువుగా గుర్తించేట్టు చేస్తున్నాయి. నా ఆజ్ఞ లేనిదే ఆకైనా కదలదు అని బాబా అన్నారు. గురువుగారి ఆజ్ఞ లేకుండా కనురెప్పైనా కదలదని నా అనుభవం.

లౌకికంగా చూస్తూ నా భర్త, కుటుంబం, పిల్లలు, రక్తసంబంధీకులు, బంధుజనం అందరూ వున్నారు, వుంటారు గాక. వీళ్లంతా ఒకవైపు, మరోవైపు గురువుగారు మాత్రమే వుంటారు. ఈ ప్రపంచం అంతా ఒకవైపుంటే, నేను గురువుగారి వైపే వుంటాను. ఎందుకంటే నా బలం, బలహీనత రెండూ గురువే. నా బలం ఏంటంటే నాకు ఏం జరిగినా గురువుగారున్నారు, బలహీనత ఏంటంటే ఆయన లేకుండా జీవించలేకపోవడం. చాలా సంవత్సరాల తరువాత ఒక్కసారిగా మనస్సుకు స్ఫురించింది. బాబా, గురువుగారు వేరు కాదని, వీరిద్దరూ నాకు ఒకే రకంగా దర్శనమిచ్చారని, నిదర్శనమిచ్చారని అందుకే. నా గురువే నా ప్రాణం, నా గురువే నా సర్వస్వం. మావారు సెప్టెంబర్ 15న ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి, ఆఫీసర్‌గా వర్కు చేస్తున్నారు, ఇంకా పోస్టింగ్ ఎక్కడో కన్‌ఫర్మ్ కాలేదు.

**–సుజాత, బోధన్**





1954 అక్టోబర్ 7న జన్మించిశిష్యకోటికి సాయిభక్తి, జ్ఞానములను అందించి, సాయినే సత్యమని ఎఱుకపరచి
2010 నవంబర్ 13న దేహ త్యాగము చేసిన శ్రీబాబూజీ ఈ శతాబ్ధమునకు ప్రత్యక్షగురువు, దైవము.
జీవులకు వికాసము కలిగించడానికి భగవంతుడు గురువుగా ఓ దేహాన్ని ధరించి, వారి దర్శన, స్పర్శన, సరస, సల్లాప, సంతోష, సుబోధలను వ్యక్తం చేస్తారు. ఆ సద్గురుమూర్తిని - భౌతిక రూపానంతరమున ఎవరైతే త్రికరణశుద్ధిగా స్మరిస్తారో వారికి - సద్గురు సాన్నిధ్యము సర్వదా అనుభవైకవేద్యమే!
త్రికరణశుద్ధితో, సమదృష్టితో దర్శించినపుడే గురువే - భగవంతుడను దర్శన జ్ఞానము కలుగును.
సర్వ సమున్నత దైవమే అయినా అట్టి సద్గురు చరణములను నిత్యమూ, నిర్ణీత కాలమున, సమర్పణ బుద్ధితో స్మరిస్తూ సద్గురు బోధలను జీవనమున ఆచరిస్తూ చరించడమే సచ్ఛిష్యునిగా మన కర్తవ్యము.

